సాక్షి
తిరుపతి
శుక్రవారం | 26 | మే | 2023



మంచి క్రీడాకారులుగా రాణించండి

మంచి క్రీడాకారులుగా ఎదగాలని చీఫ్ కోచ్ సయ్యద్, తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ పిలుపునిచ్చారు. - 8లో



పిల్లలతో ఆటలొద్దు

ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను రవాణా శాఖాధికారులు పరీక్షిస్తున్నారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	39	27
చిత్తూరు	38	27
తిరుమల	35	24
గూడూరు	42	30
నగరి	40	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్టుమెంట్‌లో నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,995 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,663 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.3.60 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టోకెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిప్రభు



తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రవిప్రభును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ నాగమునేంద్రుడు ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలతో పాటు నెల్లూరు మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కమ్యూనిటీ మెడిసిన్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రవిప్రభును నియమిస్తూ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు.

శివుని సేవలో మేజర్ జనరల్



మేజర్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న ఏఈఓ సతీష్‌మాలిక్

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం న్యూఢిల్లీకు చెందిన డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ, పీ.ఎస్.శేషరావత్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ ఏఈఓ సతీష్‌మాలిక్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద అర్చకులు ఆశీర్వచనం అందించగా.. ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో వెంకటస్వామి పాల్గొన్నారు.

టీటీడీ ప్రాణదాన పథకానికి 81 మంది ఎంపిక



రోగులను ఎంపిక చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ తదితరులు

తిరుపతి తుడా: స్విమ్స్‌లో ఉచితం శస్త్ర చికిత్సలకు టీటీడీ ప్రాణదాన పథకం కింద 81 మంది పేద రోగులను ఎంపిక చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. గురువారం ప్రాణదాన కమిటీ సభ్యులు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, టీటీడీ సీఎంఓ డాక్టర్ నర్మదా, రుయా సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ లక్ష్మణ్నాయక్, స్విమ్స్ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాబు సమావేశమయ్యారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక స్థితిగతులను పరిశీలించారు. బియ్యం కార్డు కలిగి దారిద్య్రరేఖకు దిగువున ఉన్న నిరుపేదలను టీటీడీ ప్రాణదాన పథకానికి ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ తెలిపారు.

లేఅవుట్ల సమీపంలోనే ఇటుక బట్టీలు



మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: జగనన్న లే అవుట్ల సమీపంలోనే ఇటుక బట్టీలు ఏర్పాటుచేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇటుకలు పంపిణీ చేయాలని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, గృహనిర్మాణశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మీ పరిధిలో కేటాయించిన లేఅవుట్లలో ప్రతి వారం పురోగతి చూపాలని చెప్పారు. వివిధ స్టేజీలలో ఉన్న ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయడానికి మట్టి ఇటుకలు, సిమెంట్ రాళ్లు అందుబటులో ఉంచాలన్నారు.

వికృత రాజకీయం



టీడీపీ నేతల హెచ్చరికలతో ఇళ్లకు తాళాలు వేసిన పేటఅగ్రహారం గ్రామస్తులు

'దళితులుగా ఎవ్వరైనా పుట్టాలనుకుంటారా' ఈ మాట అన్నది ఎవ్వరో కాదు..! 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే రాజకీయ కురువృద్ధుడు నారా చంద్ర బాబునాయుడు. అసెంబ్లీ సాక్షిగా దళితులను కించపరిచేలా వ్యవహరించి విమర్శల పాలయ్యారు. తర్వాత రాష్ట్ర రాజధాని అమరావతిలో పెత్తందార్లకకు కొమ్ముకాస్తూ దళిత, గిరిజన సామాజిక వర్గాలు ఉండకుండా చీకటి జీవోలు సృష్టించి అభాసుపాలయ్యారు. ఇప్పుడు ఇదే కోవలో దళిత ఎమ్మెల్యేలు, మంత్రులను అంటరానివారిగా ముద్రవేయాలని తమ పార్టీ నాయకత్వాన్ని రెచ్చగొడుతున్నారు. అంతేగాక సభ్యసమాజం తలదించుకునేలా దళిత ఎమ్మెల్యే తిరిగి వచ్చిన గ్రామాన్ని పసుపునీళ్లతో శుభ్రం చేయాలని, పాలతో అభిషేకాలు చేయాలని ఆదేశాలు జారీచేసి అమలు చేయిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- దళితులను కించపరిచేలా టీడీపీ దుర్మార్గపు చేష్టలు
- ఆ సామాజికవర్గ ప్రజాప్రతినిధులే టార్గెట్
- గ్రామాల పర్యటన అనంతరం పసుపునీళ్లతో శుభ్రం చేస్తున్న తమ్ముళ్లు
- కంప్యూటర్ యుగంలోనూ అంటరానితనమా?
- జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో అరాచకం

సాక్షి, తిరుపతి: దళితులన్నా, దళిత జాతి అన్నా టీడీపీకి పట్టేటట్టు లేదు. దళితుల ఓట్లతో గద్దెనెక్కి 14 ఏళ్లు ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా 'దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా' అంటూ అవహేళన చేసిన విషయం తెల్సిందే. అలాగే రాష్ట్ర రాజధానిలో పెత్తందారులు, అగ్రకులస్తులే ఉండాలంటూ గిరిగీసుకున్నారు. దీనిపై కోర్టులు మొట్టికాయలు వేయడంతో వెనక్కి తగ్గారు. ఇప్పుడు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుండడంతో తీవ్ర నైరాశ్యంలో పడిపోయారు. తమకు ఇక భవిష్యత్ ఉండదనే ఉద్దేశంతో ఆ పార్టీ నేతలను రెచ్చగొడుతున్నారు. దళిత ఎమ్మెల్యేలు, మంత్రులనే టార్గెట్ చేస్తూ వారి పర్యటనలకు అడగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. గ్రామాల్లోకి వచ్చిన నేతలకు ఎవ్వరూ స్వాగతం పలకరాదని హుకుం జారీ చేస్తున్నారు. తమ సామాజికవర్గం వారు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లాలంటూ ఆదేశాలిస్తున్నారు. అలా వెళ్లని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అంతటితో ఆగక కొందరు అగ్రశ్రేణి నేతలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌లను రంగంలోకి దింపుతున్నారు. ఆయా గ్రామాల్లో ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేసి తమ సామాజిక వర్గంతోపాటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఒకవేళ దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటిస్తే వెంటనే అడ్డుకోవాలని సూచిస్తున్నారు.

దళితులంటే మలినమా?

స్వాతంత్ర భారతంలో దళితజాతి ఉద్ధరణకు సామాజిక వేత్తలు కంకణబద్ధులయ్యారు. అంటరానితనం రూపుమాపడానికి అహర్నిశలు శ్రమించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వల్లభాయ్‌పటేల్‌లాంటి మహానుభావులు దళితులు, నిమ్నజాతీయుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారు. ఇప్పటికీ వారి అడుగుజాడల్లో నడవాలని నేతలు సూచిస్తుంటారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కులాలను కించపరుస్తూ, దళితులను అంటరాని వారిగా ముద్రవేయాలని తహతహలాడుతున్నారు. ఈ కోవలోనే జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు తమ అధినేత అడుగుజాడల్లో నడిచారు. పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బుధవారం పేట అగ్రహారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసి గ్రామంలో ఎవరూ ఉండకూడదని స్థానిక టీడీపీ నాయకులు ప్రజలను భయాందోళనకు గురిచేసి తాళాలు వేయించారు. ఎమ్మెల్యే ప్రజలను కలవకుండా చేయాలని పంచాయతీలోని 5 గ్రామాల్లో ప్రజలంతా తాళాలు వేసుకుని పోవాలని టీడీపీ నాయకులు హుకుం జారీ చేశారు. తాళాలు వేసుకుని వెళ్లకుంటే అంతు చూస్తామని భయపెట్టారు. ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి వెళ్లాక వీధులన్నీ పసుపు నీళ్లతో శుభ్రం చేయించారు.

ఆదేశాలు పాటిస్తూ.. అరాచకాలు సృష్టిస్తూ..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నాయకుడు మనోహర్‌నాయుడు స్థానికులను బెదిరింపులకు గురిచేశారు. జీడీనెల్లూరు మండలం, తాటిమాకుల కండ్రిగ వాసులకు ఫోన్‌చేసి ఇళ్లకు తాళం వేసుకుని వెళ్లాలని హుకుం జారీచేశారు. 'ఉప ముఖ్యమంత్రి గురువారం వస్తున్నారు.. ఆయన వచ్చే సమయానికి గ్రామంలో ఎవ్వరూ ఉండడానికి వీల్లేదు' అని ఫోన్లు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే మండలం, పాచిగుంటలో బుధవారం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎవ్వరూ పాల్గొనడానికి వీల్లేదని, అసలు గ్రామంలో ఉండకుండా తాళాలు వేసుకుని వెళ్లిపోవాలని ఆదేశించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

నేను దళితుడనే కదా..మీ బాధ?



నేను దళితుడనే కదా మీ బాధ.. దళితులు ఎమ్మెల్యేలు కాకూడదా? ప్రజా సేవలో మేం ఉండకూడదా? గడపగడపకు వెళ్లొస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపు నీళ్లతో మేం తిరిగి వచ్చిన వీధులన్నీ కడగడమేమిటి.? టీడీపీ ప్రభుత్వంలో ఏంచేశారు..? జనం అందుకే మిమిల్ని ఛీకొట్టారు. బుధవారం పేట అగ్రహారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తిచేసి వచ్చాక అక్కడి టీడీపీ నాయకులు మేం తిరిగిన రోడ్లన్నీ పసుపు నీళ్లతో కడగడం విడ్డూరంగా ఉంది. మేం గడపగడపకు వస్తోంది ఓట్లడగడానికి కాదు. సమస్యలను తెలుసుకోవడానికే మాత్రమే. దళితులంటేనే చంద్రబాబునాయుడుకు, ఆపార్టీ నాయకులకు తొలినుంచీ గిట్టదు. దళితులంటే చులకనగా చూసే తత్వం వారిది. టీడీపీ నాయకులు ఎన్ని మంత్రాలు.. తంత్రాలు చేసినా మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమే. ఇకపై నీచ రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు.

– ఎం.ఎస్.బాబు, పూతలపట్టు ఎమ్మెల్యే

దళిత ఎమ్మెల్యేలు గ్రామాలకు రాకూడదా?



దళిత ఎమ్మెల్యేలు గ్రామాలకు రాకూడదా? స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇంత కులపిచ్చా? బుధవారం గంగాధర నెల్లూరు మండలం పాచిగుంట గ్రామంలో మేం పర్యటిస్తే టీడీపీ జిల్లా నాయకుడు పాచిగుంట మనోహర్ నాయుడు కమ్మ సామాజికవర్గానికి చెందిన 22 కుటుంబాలను ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లమన్నారు. గురువారం తూగుండ్రం పంచాయతీ తాటిమాకులపల్లెలో పర్యటిస్తే ఆ గ్రామంలోని 10 కుటుంబాల వారిని ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లమని మనోహర్‌నాయుడు ఆదేశించారు. దళిత ఎమ్మెల్యేలు గ్రామాలకు రాకుండా అడ్డుకోవాలని చంద్రబాబు నాయుడు, లోకేష్ ఆ పార్టీ నాయకులకు సలహాలు ఇస్తున్నారు. దళిత సోదరులారా మేల్కొండి. చంద్రబాబుకు దళితులంటే ఎందుకు అంత కక్ష? దళిత కుటుంబాల్లో పుట్టడం నేరమా..? రాష్ట్రానికి పట్టిన పెద్ద శని చంద్రబాబే. కులాలను రెచ్చగొట్టి లబ్ధిపొందిన నీచుడు ఆయన.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

నాడు–నేడు పనులు వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పాఠశాలలు జూన్ 12న ప్రారంభం కానున్న నేపథ్యంలో నాడు–నేడు పనులకు సంబంధించి మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, కిచెన్ షెడ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం నాడు–నేడు, వ్యాధులపై సర్వేకు సంబంధించి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాల ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలని డీఈఓ శేఖర్‌కు సూచించారు. జగనన్నకు చెబుదాం 1902 కాల్ సెంటర్, అలాగే స్పందన కార్యక్రమంలో అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ఎన్సీడీ సర్వే ద్వారా గుర్తించిన హైపర్ టెన్షన్, డయాబెటిస్ ఇతర వ్యాధిగ్రస్తులకు తప్పనిసరిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఇంటింటికీ వైద్యం) ద్వారా ప్రతినెలా వారికి మందులను ఉచితంగా అందజేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వాహనం నెలలో రెండుసార్లు తప్పనిసరిగా ఆయా సచివాలయాలయాల పరిధిలో పర్యటించాలన్నారు. కంటి వెలుగుకు సంబంధించి పరీక్షలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ప్రణాళిక అధికారి అశోక్‌కుమార్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారులు సుశీలా దేవి, ఆదిశేషారెడ్డి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ అరుణసులోచనాదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

వేడుకగా మహాసంప్రోక్షణ



విమాన గోపురం కలశాలకు మహా సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



మహాసంప్రోక్షణలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జేఈఓ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం మహాసంప్రోక్షణ అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 21 నుంచి 25 వరకు స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ విమాన గోపురానికి బంగారు పూత పూసిన రాగి రేకులు అమర్చే పనులు పూర్తి కావడంతో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 4 నుంచి 7.30 గంటల వరకు కుంభారాధన, నివేదన, హోమం, అలాగే 7.45 నుంచి 9.15 గంటల వరకు మిథునలగ్నంలో మహా సంప్రోక్షణ శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం 11.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పెద్దశేష వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహనరంగాచార్యులు, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, డీఎల్ఓ వీర్రాజు, డెప్యూటీ ఈఓలు శాంతి, గోవిందరాజన్, ఈఈ మనోహర్, వీజీఓ మనోహర్, ఏఈఓ రవికుమార్, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ధనంజయులు, రాధాకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ కుటుంబ సమేతంగా గురువారం రాత్రి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద సూపరింటెండెంట్ మధు ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. న్యాయమూర్తి మొదట ధ్వజ స్తంభానికి నమస్కరించి, తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ వేద పండితులు, అధికారులు వేద ఆశీర్వాదం అందించి, ప్రసాదం, అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

నేడు ఎస్‌జీటీల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్‌జీటీ టీచర్ల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం జరుగుతుందని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, గణితం, ఇతర సబ్జెక్టుల సీనియారిటీ జాబితాను డీవైఈఓ, ఎంఈఓలకు పంపినట్లు వెల్లడించారు. డీఈఓ కార్యాలయంలో కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు.

చిత్తూరు డెయిరీలో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న అహ్మద్‌బాబు

తిరుపతి అర్బన్: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు డెయిరీలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు కో–ఆపరేటివ్ కమిషనర్ అహమ్మద్ బాబు తెలిపారు. పాడి రైతుల నుంచి పాల సేకరణ పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో జగనన్న పాలవెల్లువపై కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితో కలిసి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా రిజిస్టర్ అయిన పాడిరైతులందరికీ రుణ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో 4,004 మంది పాడి రైతులు రిజిస్టర్ చేసుకుంటే 101 మందికి మాత్రమే రుణ సౌకర్యాన్ని కల్పించారన్నారు. పాలకు అధిక ధర చెల్లిస్తోంది ఒక్క అమూల్‌లేనని గుర్తుచేశారు. ఏఎంసీ, బీఎంసీల్లో రిపేర్లు వస్తే 7396211403కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వారంలోపు డీసీసీబీ పాడి రైతులకు రుణాలు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులరెడ్డి, అమూల్ ప్రతినిధి నికుంజ్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, పశుసంవర్ధక శాఖ, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

తిరుపతిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారిచే సచివాలయ ఉద్యోగుల కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్ష ఈ నెల 26, 27 తేదీల్లో పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా రెవెన్యూ అధికారి పలు విభాగాల ఉద్యోగులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కారుణ్య నియామకంలో భాగంగా ఎంపికై సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5, వీఆర్వో గ్రేడ్ 1, గ్రేడ్ 2, సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్ష నిర్వహణ ఉంటుందని వెల్లడించారు. పరీక్షకేంద్రం ఎస్ఎస్ డిజిటల్‌లో ఈ నెల 26న నాలుగు షిఫ్టలలో 480 మంది, ఈ నెల 27న మూడు షిఫ్టలలో 347 మంది ఆన్‌లైన్ పరీక్ష రాయనున్నారని స్పష్టం చేశారు. ఆ మేరకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ నవ్యజ్యోతి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నాగజ్యోతి, ఎస్ఎస్‌డిజిటల్ శ్రీధర్, ఎస్‌బీ చంద్రశేఖర్, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో గాలీవాన బీభత్సం



కరకంబాడి రోడ్డులో కూలిన చెట్టు



పోస్టాఫీసు వద్ద గాలీవాన



గెస్ట్‌లైన్ వద్ద కూలిన చెట్టు



కొర్లగుంట సర్కిల్ వద్ద నిలిచిన వర్షపునీరు



గోవిందనగర్‌లో కూలిన విద్యుత్ స్తంభం

తిరుపతి తుడా: తిరుపతిలో భారీ వర్షం నమోదైంది. గురువారం సాయంత్రం సుమారు గంటకు పైగా గాలీవాన బీభత్సం సృష్టించింది. పెనుగాలుల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తొలగించారు. అలాగే మధురానగర్, రైల్వే కాలనీ, కొర్లకుంట, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, అశోక్నగర్, కోరమేనుగుంట, ఎస్టీవీ నగర్, గాంధీపురం తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. కరకంబాడి రోడ్డు, హరేరామహరే కృష్ణ రోడ్, ఎస్వీ యూనివర్సిటీ రోడ్, రుయా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీకి సంబంధించి పలువురు కండక్టర్లు, డ్రైవర్లకు పదోన్నతలు ఇచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 82 మంది గ్రేడ్–2 కండక్టర్లు గ్రేడ్–1 కండక్టర్లు గాను, 122 మంది గ్రేడ్–2 డ్రైవర్లు గ్రేడ్–1 డ్రైవర్లు గాను పదోన్నతలు పొందారని తెలిపారు. మరోవైపు 2016–2019 కాలంలో మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఫిట్‌నెస్‌కు సంబంధించి పలు పరీక్షలు నిర్వహించి 14 మందికి బ్రెడ్ విన్నర్ పథకం ద్వారా ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వివరించారు.

ప్రాణాలతో ఆటలొద్దు..

ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల సామర్థ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయకుండా ముందస్తు చర్యలు ప్రారంభించింది. జూన్ నెల నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో రవాణాశాఖాధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాలకు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సులను ఫిట్‌నెస్ కోసం తీసుకొస్తున్నాయి. ఎంవీఐ స్వయంగా వాహనాన్ని నడిపి పనితీరు పరీక్షిస్తున్నారు.

- త్వరలో పాఠశాలల పునః ప్రారంభం
- డీటీసీలో ప్రైవేటు స్కూళ్ల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష
- క్యూ కడుతున్న వాహనాలు
- కండీషన్ లేకుంటే బండి వెనక్కు పంపడమే
- నిర్వహణలో నిర్లక్ష్యం వద్దంటున్న అధికారులు

చిత్తూరు రూరల్: ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు రోడ్డు మీదకు రావాలంటే తప్పనిసరిగా రవాణా శాఖ జారీ చేసిన సామర్థ్య ధ్రువీకరణ పత్రం ఉండాలి. జిల్లాలో విద్యా సంస్థల బస్సులు 840 దాకా ఉన్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల కండీషన్‌పై దృష్టిసారించారు. వాహనాలు నగరంలోని డీటీసీ కార్యాలయానికి క్యూ కడుతున్నాయి. రోజుకు 30 నుంచి 40 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు వస్తున్నాయి. అధికారులు నిశితంగా తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 250 బస్సులకు పరీక్షలు చేశారు. ఇందులోని 80 బస్సులకు లోపాలు గుర్తించి వెనక్కి పంపించారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నారు.

తనిఖీల్లో బయటపడుతున్న బండారం

ఫిట్‌నెస్ కోసం వస్తున్న బస్సులను అధికారులు పరిశీలిస్తుంటే వాటి బండారం బయటపడుతోంది. విద్యార్థులు బస్సులోకి ఎక్కే మెట్లు సరైన ఎత్తులో ఉండడం లేదు

- అత్యవసర ద్వారం వెంటనే తెరచుకోవడం లేదు
- టైర్లు సరిగా ఉండడం లేదు. హ్యాండ్ బ్రేక్ పని చేయడం లేదు
- సీట్లు కూడా సక్రమమంగా ఉండటం లేదు
- స్టీరింగ్ సరిగా తిరగడం లేదు. బ్రేకులు వేసినప్పుడు పెద్దగా శబ్దం వస్తోంది
- డ్రైవర్లకు ఐదేళ్ల అనుభవం ఉండడం లేదు



బస్సు ఫిట్‌నెస్ పరీక్ష చేస్తున్న ఎంవీఐ

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ప్రైవేటు స్కూల్ బస్సుల విషయంలో నిబంధనలకు కచ్చితంగా పాటించాలి. పిల్లల విషయంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యం అలసత్వం వహించ కూడదు. బండి రోడ్డు ఎక్కాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలు అతిక్రమించి బండి రొడెక్కితే సీజ్ చేస్తాం. కేసులు కూడా పెడుతాం. బడి తెరిచే లోపు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు



యాజమాన్యాలు చేయాల్సినవి

- వాహన చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను –చెల్లింపు రశీదు, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలి
- డ్రైవర్ ఫొటోను బస్సులో ఏర్పాటు చేయాలి
- అద్దాలకు గ్రిల్స్ అమర్చి ఉండాలి
- డ్రైవర్‌కు 60 ఏళ్లు మించరాదు
- ప్రతి బస్సులో అటెండర్ ఉండాలి. రూట్ మ్యాప్ తప్పనిసరి
- ప్రతి నెల స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు
- బస్సులకు తప్పనిసరిగా పసుపు రంగు వేయాలి
- పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నంబర్, పూర్తి చిరునామా ఎడమవైపు కనిపించేలా ఉండాలి.
- డ్రైవర్లు మూడు నెలలకోసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి.

ఇవి తప్పనిసరి

- ఎఫ్సీ పొందేటప్పుడు డ్రైవర్ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్ దరఖాస్తులో నమోదు చేయాలి
- డ్రైవర్‌కు 50 ఏళ్ల లోపు వయస్సు, ఐదేళ్లు వాహనం నడిపిన అనుభవం ఉండాలి
- ఒక బస్సు డ్రైవర్ వివరాలు మరోదానికి ఇచ్చే అవకాశం ఉండదు. ఒకవేళ అతను వేరే పాఠశాలకు మారినా సంబంధిత వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో చేయాలి
- అన్ని అర్హతలున్న వారినే యాజమాన్యాలు తీసుకోవాలి
- 15 ఏళ్లు దాటిన బడి బస్సులను తుక్కు కింద పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాంటి వాహనాలకు అనుమతి ఉండదు
- కిటికీకి స్క్రీన్, వైపర్స్, లైటింగ్ పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఏమైనా లోపాలు గుర్తిస్తే రికార్డులో నమోదు చేసి వెంటనే మరమ్మతులు చేయించాలి
- ప్రథమ చికిత్స కిట్, అత్యవసరమైన మందులు బస్సులో ఉంచాలి
- పాఠశాల, కళాశాల ఆవరణలోనే బస్సులు ఎక్కాలి, దిగాలి



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.62,230
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,589
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.72,600
రిటైల్ వెండి గ్రాము రూ.74.60

నేడు సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ చైర్మన్ రాక

తిరుపతి అర్బన్: సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకుని బస చేస్తారని చెప్పారు. 27న జిల్లా కలెక్టర్, ఎస్పీ, టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. 28న రాత్రి తిరుగు ప్రయాణం అవుతారని పేర్కొన్నారు.

యువకుడిపై అట్రాసిటీ కేసు

చిల్లకూరు: మండల కేంద్రంలోని శంకర గిరిజన కాలనీకి చెందిన ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన యువకునిపై గురువారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం.. మండలంలోని శంకరగిరిజన కాలనీకి చెందిన ఓ యువతి, ఓడూరు సమీపంలోని రొయ్యల పరిశ్రమలో పనిచేసేది. పున్నపువారిపాళెం గ్రామానికి చెందిన వాసు కూడా అదే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అక్కడ అతడితో యువతికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమెను పనికి వెళ్లకుండా నిలిపి వేశారు. అయితే ఆ యువకుడు ఆమె ఇంటి వద్దకు వచ్చి యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు యువకునిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ జరిపి, అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.





హత్య జరిగిన పదినెలల తరువాత..

రేణిగుంట: వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది జూలై 26వ తేదీన రిటైర్డ్ లైన్‌మ్యాన్ బోలపాటి వెంకటేశ్వర్లు మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. అతన్ని అతికిరాతకంగా హతమార్చి శరీర భాగాలను ముక్కలు చేసి వేర్వేరు చోట్ల పూడ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి శ్రీకాళహస్తి పట్టణంలోని బుజ్జినాయుడుకండ్రిగ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ భీమారావు గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ లైన్‌మెన్ హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బోలపాటి వెంకటేశ్వర్లు వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేసే సమయంలో వరదయ్యపాళెంలోని ఓ మహిళతో సహజీవనం సాగించాడు. అయితే ఈ విషయం నచ్చిన ఆ మహిళ కొడుకు విక్కీ అలియాస్ విజయకుమార్ ఎలాగైనా వెంకటేశ్వర్‌ను చంపాలని ప్లాన్ చేసి గతేడాది జూలై 26వ తేదీన తొట్టంబేడు మండలం బోనుపల్లి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయని నమ్మించి తీసుకెళ్లి మరో ఐదుగురితో కలసి తీసుకెళ్లి చంపేశారు. మృతుని శరీర భాగాలను ముక్కలుగా చేసి పూడ్చిపెట్టారు. అయితే మళ్లీ గోతిని తవ్వి వెంకటేశ్వర్లు శరీర భాగాలను తెలుగుగంగ కాలువలో పడేశారు. హత్య కేసును విచారణ చేపట్టిన పోలీసులు గురువారం బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఆలత్తూరు సమీపంలో ప్రధాన నిందితుడు విక్కీ అలియాస్ పసుపులేటి విజయకుమార్(34), వరదయ్యపాళెం మండలం అంబూరు ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల చిన్నపుట్టయ్య(35), వరదయ్యపాళెం మండలం చావలి లింగమనాయుడుపల్లికి చెందిన పోలూరు మహేష్ అలియాస్ పాండా(25), వరదయ్యపాళెం బీసీ కాలనీకి చెందిన కాసుల లోకేష్(21), పసుపులేటి దుర్గాప్రసాద్(21), చావలి లింగమనాయుడుపల్లికి చెందిన తుపాకుల చెల్లయ్య(23)ను అరెస్ట్ చేశారు. వారు హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, పూడ్చేందుకు ఉపయోగించిన గడ్డపార, పార, మృతుడు వెంకటేశ్వర్లుకు చెందిన ఏటీఎం కార్డు, ఎకోస్టార్ కారు, ఓ ద్విచక్ర వాహనాన్ని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో అపార ప్రతిభ చేసిన బీఎస్‌కండ్రిగ సీఐ విక్రమ్, సత్యవేడు సీఐ శివకుమార్, ఎస్‌ఐలు రాఘవేంద్ర, నాగార్జునరెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు.


హత్యకేసు నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ భీమారావు

ఆర్టీసీ బస్సులో మందుబాబు వీరంగం

చంద్రగిరి(తిరుపతి రూరల్): మద్యం సేవించి బస్సులో వీరంగం సృష్టించడం ఓ మందుబాబు. గురువారం తిరుపతి రూరల్ మండలం కాలూరు వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి బస్సు కండక్టర్, డ్రైవర్, ప్రయాణికుల వివరాల మేరకు.. తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 30 మంది ప్రయాణికులతో తిరుమల నుంచి వేలూరుకు వెళ్తోంది. అయితే తిరుపతి సమీపంలో చెన్నైకి చెందిన మణి అనే వ్యక్తి బస్సు ఎక్కాడు. బస్సు రన్నింగ్‌లో ఉండగా చివరి సీట్లో కూర్చుని తిరుపతి రూరల్ మండలం కాలూరు సమీపంలోకి వచ్చేసరికి అతను మద్యం సేవిస్తున్నాడు. దీన్ని చూసిన తోటి ప్రయాణికులు బస్సు కండక్టర్ శ్రీనివాస శెట్టి, డ్రైవర్ ఎస్‌ఆర్ వేలుకు విషయాన్ని తెలిపారు. దీంతో కాలూరు సమీపంలో అతన్ని బస్సు దిగాలని కండక్టర్ సూచించగా, నన్నే బస్సులో నుంచి దింపేస్తారా అంటూ మణి మద్యంమత్తులో రెచ్చిపోయాడు. దీంతో అందరూ బలవంతంగా అతన్ని బస్సులో నుంచి దింపేశారు. అయితే నన్ను బస్సులో నుంచి దింపేస్తే ఊరుకుంటానా అంటూ రాయి తీసుకుని బస్సు వెనుక అద్దాలను పగలగొట్టాడు. దీంతో బస్ కండక్టర్, డ్రైవర్ సదరు మందుబాబును చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా, అక్కడి సిబ్బంది సూచనల మేరకు ఎంఆర్ పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.


బస్సు అద్దాలు పగులగొట్టిన మణిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

భాకరాపేట : అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భాకరాపేట సీఐ తులసీరాం కథనం.. ఎర్రావారిపాళెం మండలం, చింతగుంట సమీప పొలాల్లో కుళ్లిన స్థితిలో మృతదేహం ఉన్నట్లు గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. ఎర్రావారిపాళెం ఎస్‌ఐ, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. పది రోజుల క్రితం చనిపోవడంతో మృతదేహాన్ని గుర్తుపట్టడానికి వీల్లేకుండా పోయింది. తల, కాళ్లు తదితర అవయవాలను కుక్కలు ఒక్కోచోటుకు ఈడ్చుకెళ్లాయి. చుట్టుపక్కల గ్రామాల్లో విచారణ చేపట్టారు. నెరబైలు ఎస్టీ కాలనీకి చెందిన ఓ యువతి పది రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయినట్లు సమాచారం తెలుసుకుని ఆరా తీశారు. నెరబైలు ఎస్టీ కాలనీకి చెందిన దొరస్వామి దంపతులను పిలిపించి మృతదేహాన్ని చూపించారు. వారు మృతదేహం వద్ద ఉన్న చున్నీ, జడ, గాజులు, చెప్పులు చూసి ఇవి తమ అమ్మాయి మంజులవేనని నిర్ధారించారు. దీంతో మృతదేహం నెరబైలు ఎస్టీ కాలనీ దొరస్వామి కుమార్తె మంజుల(25)దిగా గుర్తించి కేసు నమోదు చేశారు. అయినా డీఎన్ఏ పరీక్షలకు పంపనున్నట్లు సీఐ తెలిపారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం చేయించారు.


మంజుల (ఫైల్)

సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభించండి

తిరుపతి అర్బన్: వందేళ్ల తర్వాత రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పనులు పూర్తయిన తర్వాత డేటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభించాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో భూముల రీసర్వే జిల్లా అధికారి జయరాజ్‌తో కలసి సర్వేపై అధికారులతో సమీక్షించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆన్‌లైన్ చేయాలని స్పష్టం చేశారు. రీసర్వే కార్యక్రమంలో భాగంగా రైతుల భూముల విస్తీర్ణం ఖాతా, ఆధార్, సర్వే నంబర్‌కు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని తెలిపారు. సర్వే రాళ్లు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని వెల్లడించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలు ఎక్కువగా రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయని, అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల భూమి విస్తీర్ణానికి సంబంధించిన 291 గ్రామాల రైతుల భూముల డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. మొదటిదశ సర్వే రాళ్లు నాటే ప్రక్రియ 69 గ్రామాల్లో పూర్తయిందని, రెండోదశలో సర్వే రాళ్లు నాటే ప్రక్రియ 12 గ్రామాలకు గానూ 3 గ్రామాల్లో పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లో నిర్దేశించిన గడువులోపు సర్వే రాళ్లు నాటే ప్రక్రియ పూర్తి కావాలని వివరించారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసరావు

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ


మాట్లాడుతున్న సెబ్ కమిషనర్ రవిప్రకాష్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

– సెబ్ కమిషనర్ రవిప్రకాష్


తిరుపతి క్రైం: జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, పూర్తిస్థాయిలో నిర్మూలించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఎన్‌డీపీఎస్ కేసులపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. గంజాయి నిర్మూలనకు పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులకు సంబంధించిన వినియోగదారుడి నుంచి ఉత్పత్తిదారుడి వరకు క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్న ఎంతటి వారిని అయినా వదిలే ప్రసక్తి లేదన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. గతంలో పోలీసు శాఖ సమన్వయంతో ఆపరేషన్ పరివర్తన 2.0ను సక్రమంగా అమలు చేసి సత్ఫలితాలను సాధించామని, తిరుపతిని మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో గంజాయి రవాణా, విక్రయించే ప్రాంతాలు, గంజాయి సేవించే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం సమూలంగా గంజాయిని నిర్మూలించాలని పదేపదే చెబుతున్నారని తెలిపారు. సమావేశంలో సెబ్ డైరెక్టర్ రాజేంద్ర, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.


మామిడి కొమ్మ విరిగిపడి మహిళా కూలీ మృతి

ఏర్పేడు: మండలంలోని సదాశివపురం వ్యవసాయ పొలాల్లో గురువారం సాయంత్రం మామిడి కొమ్మ విరిగిపడి వ్యవసాయ మహిళా కూలీ మృతి చెందింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం.. మండలంలోని సదాశివపురం గ్రామానికి చెందిన తోట మునస్వామి వ్యవసాయ పొలాల్లో వరినాట్లు వేసేందుకు అదే గ్రామానికి చెందిన గోధుమ దేశమ్మ (60), సాలమ్మ, గోవిందమ్మ, లక్ష్మి తదితర 15 మంది కూలీలు వెళ్లారు. వరినాట్లు వేస్తుండగా గాలి, వాన రావడంతో కూలీలు వరినాట్లు నిలిపివేసి పక్కనే ఉన్న మామిడి చెట్టు కిందకు వెళ్లారు. గాలి, వానతో పాటు పిడుగు పడడంతో మామిడి చెట్టు నుంచి పెద్ద కొమ్మ విరిగి పడింది. ఈ ప్రమాదంలో గోధుమ దేశమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సాలమ్మ, గోవిందమ్మ, లక్ష్మికి గాయాలయ్యాయి. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పిడుగుపాటుకు కొబ్బరిచెట్టులో మంటలు

ఏర్పేడు: పిడుగుపాటుకు కొబ్బరి చెట్టులో మంటలు చెలరేగిన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని వికృతమాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గురువారం సాయంత్రం 3.30 గంటలకు వికృతమాల గ్రామానికి చెందిన బుల్లెయ్య ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. కొబ్బరి చెట్టుపై మంటలు చెలరేగాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.


దేశమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


పిడుగుపాటుకు కొబ్బరి చెట్టులో మంటలు

మంచి క్రీడాకారులుగా రాణించండి

తిరుపతి కల్చరల్ : వేసవి ఉచిత క్రీడాశిక్షణా శిబిరాల్లో క్రీడల్లోని మెలకువలను అందిపుచ్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సయ్యద్, తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ అధ్వర్యంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత క్రీడాశిక్షణా శిబిరాలను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ నుంచి క్రీడాకారులకు ఉచితంగా బాల్స్‌ను అందజేశారు. అలాగే హాకీ ఉచిత క్రీడాకారులకు ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా శిబిరాలకు అనూహ్య స్పందన రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.